




నిప్పులు చెరుగుతున్న సూర్యుడు

● 42 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు ● వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

కరీంనగర్ టౌన్, మే 20: రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుంటే కరీంనగర్‌లో మాత్రం సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఓవైపు ఎండలు మరోవైపు భరించలేని వేడి, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాతావరణ శాఖ అధికారులు రాష్ట్రంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, ఈసారి వర్షాలు ముందే ప్రారంభమవుతాయని చెప్పడంతో ఇక ఎండల బాధపోయినట్లేనని అంతా భావించారు. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీలకు చేరుకున్నాయి. వామ్మో... ఇవేమి ఎండలు... ఇప్పుడే ఇలా ఉంటే ఇంకా రోహిణికార్తెలో ఎండలు ఎలా ఉంటాయోనంటూ జనం బెంబేలెత్తిపోతున్నాయి... బయట నిప్పులు చెరుగుతున్న సూర్యుడు... ఇంట్లో ఉంటే భరించలేని ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆది, సోమవారాల్లో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించారు. జిల్లా అంతటా 40 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 6 గంటల నుంచే ఉదయించే భానుడు ప్రతాపం చూపడంతో మధ్యాహ్నం వేళల్లో ప్రజలు బయటకు రావడం లేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులతోపాటు ముఖ్య కూడళ్లు జనం లేక వెలవెల బోయాయి. జంతువులు, పక్షులు, మూగజీవాలు ఎండ వేడిమిని తట్టుకోలేక విలవిలలాడుతున్నాయి ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు కూడా పనిచేయడం లేదని, ఇంట్లో ఉండలేక పోతున్నామని, రాత్రి 10 గంటల వరకుకూడా వేడి గాలులు వీస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఎండల తీవ్రత పెరిగినందున అత్యవసరమైతే తప్పా ఇళ్ల నుంచి ఉదయం 10 తర్వాత సాయంత్రం 6 గంటల వరకు రావద్దంటూ డాక్టర్లు సూచిస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు పూర్తయ్యేదెన్నడు?

● నత్తనడకన పనులు ● కశ్మీర్‌గడ్డ రైతు బజార్ తొలగింపుతో ఇబ్బందులు



తొలగించిన కశ్మీర్‌గడ్డ రైతుబజార్

కరీంనగర్ టౌన్, మే 20: నగరంలో మార్కెట్ల విస్తరణ, సమీకృత మార్కెట్ల (ఇంటిగ్రేటెడ్ మార్కెట్స్) నిర్మాణాలు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. నగరం నలుదిశలా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలకు చేరువలోకి మార్కెట్లు, పార్కుల వంటి అభివృద్ధి పనులను ప్రాధాన్య క్రమంలో పూర్తిచేయాల్సిన బాధ్యత నగరపాలక సంస్థపై ఉంటుంది. పాలకుల నిర్లక్ష్యంతో మార్కెట్ల విస్తరణ జరగడం లేదు. నగరంలోని నాలుగు చోట్ల నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల పనులు అర్థాంతరంగా నిలిచి పోయాయి. నగరంలో ప్రజలకు అందుబాటులో వెజ్, నాన్ వెజ్, పండ్లు ఒకే చోట లభ్యమయ్యేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతితోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో దశలవారీగా నిర్మించాలని నిర్ణయించి అవసరమైన ప్రణాళికలను రూపొందించింది.

మొదటి విడతలో నాలుగు మార్కెట్లు

మొదటి విడతలో పద్మనగర్, వ్యవసాయ (బీట్) మార్కెట్, కలెక్టరేట్ బంగ్లా ముందు, కశ్మీరుగడ్డ రైతు బజార్‌లో మార్కెట్ల నిర్మాణాలకు ప్రభుత్వ అనుమతులు తీసుకుంది టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులను ప్రారంభించింది. పద్మనగర్‌లో పట్టణ ప్రగతి నిధులు 15 కోట్లతో, వ్యవసాయ (బీట్) మార్కెట్‌లో 10 కోట్ల అంచనాలతో మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండు చోట్ల పనులు పురోగతిలో ఉన్నారు. కలెక్టర్ బంగ్లా ఎదుట స్మార్ట్‌సిటీ నిధులు 14.5 కోట్లతో, కశ్మీరుగడ్డ రైతు బజార్‌ను తొలగించి అదే స్థలంలో 10 కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కలెక్టర్ బంగ్లా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు కొంత మేరకు జరుగగా, కశ్మీరుగడ్డ రైతుబజార్‌లో ప్రారంభ దశలోనే పనులు నిలిచిపోయాయి.

కళ తప్పిన కశ్మీర్‌గడ్డ రైతు బజార్

కశ్మీర్‌గడ్డ, ముకరంపుర, సప్తగిరికాలనీ, శ్రీనగర్ కాలనీ, గోదాంగడ్డ, మంకమ్మతోట, జ్యోతినగర్, భగత్ నగర్ తదితర కాలనీల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కశ్మీర్‌గడ్డలో రైతుబజారును ఏర్పాటు చేశారు. ఈ రైతుబజారుకు సమీప గ్రామాల నుంచి రైతులే కూరగాయలను పండించి తీసుకువచ్చి అమ్ముకోవడంతో పాటు కొంత మంది చిరు వ్యాపారులు రైతుల నుంచి హోల్‌సేల్‌గా తీసుకుని విక్రయించే వారు. ప్రధాన కూరగాయల మార్కెట్, వీక్లీబజార్ రైతుబజార్లకు దీటుగా స్వచ్ఛమైన కూరగాయలు, పండ్లు, చేపలు, చికెన్, మటన్ విక్రయిస్తుండడంతో ప్రజల నుంచి చక్కటి ఆదరణ లభించింది. వేకువ జామున 5 గంటల నుంచే కశ్మీరుగడ్డ రైతుబజార్ ప్రాంతమంతా రద్దీగా ఉండేది. పండుగలు, శుభకార్యాల సమయంలో మరింత రద్దీ ఉండడంతో రైతులు, వ్యాపారులే కాకుండా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రైతుబజార్‌ను తొలగించి స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఇక్కడే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎనిమిది నెలల క్రితం మార్కెట్‌ను కూల్చివేసి సమీపంలోని తాత్కాలిక షెడ్లలో కూరగాయల విక్రయాలకు అనుమతిచ్చారు. రైతు బజార్‌ను తొలగించడంతో రైతులు పూర్తిగా రావడం మానేశారు. వ్యాపారులు కూడా అక్కడొక్కరు ఇక్కడొకరు కూర్చొని కూరగాయలు విక్రయిస్తుండడంతో రద్దీ పూర్తిగా తగ్గిపోయి కాశ్మీరుగడ్డ రైతుబజార్ కళ తప్పిపోయింది.

నిధులు విడుదలయ్యేనా?

ఈ మార్కెట్లన్నింటిని వీలైనంత త్వరగా నిర్మించి ప్రజలకు డిసెంబరులోగానే అందుబాటులోకి తెస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. పద్మనగర్, బీట్ మార్కెట్‌లలో మార్కెట్ నిర్మాణ పనులు చాలా వేగంగా జరగడంతో ప్రారంభిస్తారని ప్రజలు కూడా ఆశించారు. కలెక్టర్ బంగ్లా ఎదుట చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం పనులు పూర్తయితే ప్రధాన కూరగాయల మార్కెట్, చేపల, మాంసం మార్కెట్, ఫ్రూట్ మార్కెట్లలోని సమస్యలు చాలా మేరకు తగ్గుతాయని భావించారు. ఏడాది నుంచి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నా ఆశించిన మేరకు వేగంగా చేపట్టకపోవడంతో పూర్తికాలేదు. ఇప్పుడు ఆ పనులు పూర్తికావాలంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి, జీవో 65 నిధులతో పాటు స్మార్ట్‌సిటీ కింద కేంద్ర, రాష్ట్ర వాటా నిధులను విడుదల చేయాల్సి ఉంటుంది.



రోడ్డుపైన కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

రైతులపై వివక్ష చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● సమస్యలు పరిష్కరించాలి ● బీజేపీ నాయకుల డిమాండ్

భగత్‌నగర్, మే 20: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పై వివక్ష చూపుతున్నదని మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిలు అన్నారు. రైతుల సమస్యలు పరి ష్కరించాలని బీజేపీ నాయకులు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రకటించినహామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందన్నారు. పంట కొనుగోళ్లపై ముఖ్యమంత్రి జారీ చేసిన ఆదేశాలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు.

జిల్లాలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తూకంలో జరిగిన మోసాలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మద్ధతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించాలని, రుణ మాఫీ చేసి రైతు భరోసా అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్య నారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, మేకల ప్రభాకర్‌యాదవ్, మాడ వెంకట్‌రెడ్డి బత్తుల లక్ష్మీనారాయణ, ఎర్రబెల్లి సంపత్‌రావు, బొంతల కళ్యాణ చంద్ర, గాజె రమేష్, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ, సుధాకర్‌పటేల్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, బండ రమణారెడ్డి, రాగి సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

● రైతుల సమస్యలపై బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో కొత్తపల్లి తహసీల్దార్ రాజేష్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందించారు. కార్య క్రమంలో వాసాల రమేష్, కడార్ల రతన్‌కుమార్, కెంచ శేఖర్, ఎర్రోళ్ల ప్రదీప్, అనిల్, ఉమ్మెంతల లక్ష్మారెడ్డి, కొప్పుల హరిప్రసాద్‌పాల్గొన్నారు.

● రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కొత్తపల్లి మండలం మల్యాపూర్ రైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, లచ్చయ్య, దావీదు, బుచ్చయ్య, శ్రీనివాస్, లచ్చయ్య, నర్సయ్య పాల్గొన్నారు.





మల్యాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

'శాతవాహన' వీసీ ఎవరో?

● నేటితో ముగియనున్న ప్రస్తుత వీసీ పదవీ కాలం ● సెర్చ్ కమిటీ నియామకం



గణేశ్‌నగర్, మే 20: రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉప కులపతులను నియమించనుంది. సెర్చ్ కమిటీలను కూడా నియమించింది. శాతవాహన విశ్వవిద్యాలయానికి 2021వ సంవత్సరంలో ప్రొఫెసర్ సంకశాల మల్లేష్ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవి కాలం మే 21తో ముగుస్తున్నది. శాతవాహన విశ్వవిద్యాలయాన్ని 2008వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. యూనివర్సిటీ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ముగ్గురు మాత్రమే పూర్తిస్థాయి ఉపకులపతులుగా బాధ్యతలను నిర్వర్తించారు. 2008లో మొదటి ఉప కులపతిగా మహమ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ మల్లేష్‌ను ప్రభుత్వం ఉపకులపతులుగా నియమించింది.

యూనివర్సిటీకి 12బీ గుర్తింపు



ప్రస్తుత వీసీ మల్లేష్

వీసీ మల్లేష్ పదవీకాలంలో యూనివర్సిటీ 12బీ గుర్తింపు సాధించింది. పీఎం ఉష కింద 20 కోట్ల నిధులను యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్రంలోని 10 యూనివర్సిటీ వీసీ పోస్టులు మే 21 తో ముగియనున్నది. దీనికి ముందే వీసీ పోస్టులను భర్తీ చేయాలనే ప్రభుత్వ ప్రక్రి యకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. ఉపకులపతుల నియామకానికి ఈనెల 14న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు ఈసీ పచ్చ జెండా ఊపింది. యూనివర్సిటీలకు నియమించే వీసీలను యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) నిబంధనల ప్రకారమే నియామకం జరుగుతుంది. శాతవాహన యూనివర్సిటీ సెర్చ్ కమిటీలో ప్రొఫెసర్ సాయన్న ఈసీ నామినీగా, ప్రొఫెసర్ దేవదత్ శర్మ యూజీసీ నామినీగా, శాంతి కుమారి ప్రభుత్వ నామినీగా ఉన్నారు.

వీసీ పదవి కోసం 158 మంది దరఖాస్తు

శాతవాహన యూనివర్సిటీ వీసీ పదవి కోసం 158 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. రెండు పర్యాయాలు వీసీలుగా పనిచేసిన వారిని, 70 ఏళ్లు నిండిన వారిని వీసీలుగా నియమించవద్దని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుత వీసీ పదవీ కాలం మంగళశారం ముగుస్తున్నది. ఎన్నికల కోడ్ కారణంగా కొత్త వీసీల ప్రక్రియ జాప్యం జరిగింది. ప్రస్తుతం ఉన్న వీసీనే ఇన్చార్జిగా నియమిస్తారా లేదా గత ప్రభుత్వం మాదిరిగా ఐఏఎస్ అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

బీసీలకు ఇవ్వాలని డిమాండ్

శాతవాహన విశ్వవిద్యాలయం ఏర్పడినప్పటి నుంచి బీసీ సామాజిక వర్గానికి వీసీ పదవి దక్కలేదు. ఇప్పటి వరకు ముస్లిం, రెడ్డి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్లకు వీసీ పదవులు దక్కాయి. ఈసారి బీసీ వర్గానికి ప్రొఫెసర్‌కు వీసీ పదవి దక్కేలా చూడాలని పలు బీసీ సంఘాలు ఇప్పటికే పలుసార్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

'ఉపాధ్యాయుల జీపీఎఫ్ స్లిప్స్‌ను అప్‌డేట్ చేయండి'

కరీంనగర్ టౌన్, మే 20: ఉపాధ్యాయుల జీపీఎఫ్ స్లిప్స్‌ను అప్‌డేట్ చేసి ఆన్‌లైన్‌లో పొందు పరచాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లాశాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు టీఆర్‌టీ ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజా మంజూర్ అలీ, చింతపల్లి అశోక్ రావు జడ్పీ సీఈవోను కలిసి సోమవారం వినతిపత్రం సమర్పించారు. 2022- 23, 2023-24 రెండు సంవత్సరాల జీపీఎఫ్ స్లిప్స్‌ను అప్‌డేట్ చేయలేదని, వాటిని అప్‌డేట్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని కోరారు.

విలీన గ్రామాల్లో తాగునీటికి కటకట

● ఇష్టారాజ్యంగా పైపులైన్ల ఏర్పాటు..
● కాలనీల్లో నీరు రాక ఇక్కట్లు
● నిరుపయోగంగా ట్యాంకులు



ఇష్టారాజ్యంగా వేసిన మిషన్ భగీరథ పైపులైన్



మురికి కాలువలో వేసిన మంచినీటి మిషన్ భగీరథ పైపులైన్

కరీంనగర్ రూరల్, మే 20: విలీన గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలో గత ప్రభుత్వం హయాంలో కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాలు విలీనమయ్యాయి. ఆ గ్రామాల్లో తాగునీరు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకటో డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లిలోని పలు కాలనీల్లో తాగునీటి కోసం ప్రజలు అల్లాడి పోతున్నారు. తీగల గుట్టపల్లి పరిధిలోని విద్యారణ్యపురి, సరస్వతినగర్‌తో పాటు పలు కాలనీల్లో ఇప్పటికీ పైప్‌లైన్లు వేయలేదు. మిషన్ భగీరథ కింద 1.2 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించినా పైప్‌లైన్ వేసి కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తీగల గుట్టపల్లి ప్రాంతంలో ఉన్న ప్రజలకు నాలుగైదు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సమస్యను నివారించడానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోక పోవ డంతో ఒకటో డివిజన్ కార్పొ రేటర్ కొల గాని శ్రీనివాస్ పది ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని అందిస్తు న్నారు. అధికారులు స్పందించి కాలనీలకు తాగు నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని తీగలగుట్టపల్లిలోని వాటర్ ట్యాంక్

'ఉపాధ్యాయుల సస్పెన్షన్ సరికాదు'

కరీంనగర్ టౌన్, మే 20: ఇటీవల ముగ్గురు ఉపాధ్యాయుల పై డీఈవో చర్యలు తీసుకున్నారని, వెంటనే వారిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వేసవి సెలవుల కారణంగా ఉపాధ్యాయులంతా ఇంటివద్ద ఉంటున్న సమయంలో పాఠశాలలో ఏమి జరుగుతుందనే విషయం ఎవరికీ తెలిసే అవకాశం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వాచ్‌మెన్, అటెండర్, స్వీపర్ లేకుండా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ప్రతీ విషయానికి బాధ్యులను చేయడం ఏమిటని ప్రశ్నించారు. సస్పెన్షన్లతో ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు.

'పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వేగవంతం చేయాలి'

కరీంనగర్ టౌన్, మే 20: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎస్టీయూ ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎస్టీయూ జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రవీంద్రచారి మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరీ చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి జి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పి తిరుపతిరావు, సాన కిషన్, వి వెంకటస్వామి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న గోదావరి

● మరమ్మతుల కోసం సుందిళ్ల బ్యారేజీ ఖాళీ

కోల్‌సిటీ, మే 20: గలగల పారే గోదావరి వెలవెలబోతోంది.ఐదేళ్లుగా నిండుకుండలా ఉన్న గోదావరిలో ఇప్పుడు మడుగులు దర్శనమిస్తున్నాయి. రెండేళ్ల భారీ వరదలకు ఉన్న ఇసుక కొట్టుకపోయి రాళ్లు తేలాయి... అక్కడక్కడ లోతైన గుంతల్లో మాత్రమే నీరు మిగిలింది. మరమ్మతుల కోసం ఈ నెల 18న సుందిళ్ల బ్యారేజీలో నుంచి 0.7 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. ప్రీ మాన్‌సూన్ ఆపరేషన్స్ మెయింటనెన్స్ పనులు నిర్వహించనున్నారు. ఇందు కోసం బ్యారేజీలోని నీటిని దిగువకు వదిలారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన గోదావరిలో ప్రవాహం లేదు. ఎన్టీపీసీ, రామగుండం ప్రాంతాలకు చెందిన డ్రైనేజీ నీరే ప్రస్తుతం గోదావరిలో కలుస్తుంది. గోదావరిలో ఏర్పడిన మడుగుల్లోని నీటిలోనే భక్తులు పుణ్య స్నానాలు చేస్తున్నారు. గోదావరిఖని పుష్కర ఘాట్ నుంచి ఇసుకలో నడిచి వెళ్లి పుణ్యస్నానాలు చేయడం పరిస్థితి ఏర్పడింది.

● సింగరేణికి గోదావరే దిక్కు..

గోదావరిలో నీరు తగ్గిపోవడంతో దీని ప్రభావం సింగరేణి మంచినీటి సరఫరాపై పడనున్నది. గోదావరినదిలోని ఇన్‌ఫిల్టరేషన్ గ్యాలరీ ద్వారా సింగరేణి కాలనీల అవసరాలకు ప్రతి రోజూ 23 నుంచి 25 ఎంఎల్‌డీల నీటిని పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సాండ్ బెడ్‌లో ఉన్న నీటినే సింగరేణి వాడుకోవాల్సి వస్తోంది. మరో పది రోజుల్లో వర్షాలు కురవకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.



గోదావరిలో తగ్గిన నీరు

విద్యుత్ తీగలు తెగిపడి రెండు గేదెలు మృతి

సుల్తానాబాద్, మే 20: మండలంలోని సుద్దాల గ్రామంలో సోమవారం రెండు పాడి గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఒజ్జ సదయ్య అనే రైతుతో పాటు దూడం రాములు అనే రైతుకు చెందిన పాడి గేదెలు మేతకు వెళుతుండగా మార్గమధ్యలో తెగిపడిన విద్యుత్‌తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయని రైతులు తెలిపారు. తమకు తగిన నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తప్పుడు డాక్యుమెంట్స్‌తో భూమి అమ్మకం : ఇద్దరి అరెస్టు

చొప్పదండి, మే 20: చొప్పదండి పట్టణంలోని సర్వే పంబరు 301లో తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని అమ్మిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ ఉపేంద్రాచారి తెలిపారు. 301 సర్వే నంబర్‌లో గుర్రం రాంరెడ్డి అనే వ్యక్తికి 65 గుంటల భూమి ఉంది. ఈ భూమిని రాంరెడ్డి 2010లో మునిపట్ల దేవేందర్‌రెడ్డి, అన్నాడి శ్రీకాంత్‌రెడ్డికి రిజిస్ట్రేషన్ చేశాడు. తన వాటాగా వచ్చిన 32 గుంటల భూమిని మునిపట్ల దేవేందర్‌రెడ్డి చొప్పదండికి చెందిన కొత్తూరు అంజనేయులు, సుద్దాల వెంకటస్వామికి 2019 సంవత్సరంలో విక్రయ ఒప్పందం, జీపీఏ చేశాడు. అదే భూమిలోని ఆరు గుంట భూమిని సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు అంజనేయులు ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన చిలుక బాలామణి, కళ్లెం అంజిరెడ్డికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం అదే భూమిని పాత జీపీఏ డాక్యుమెంట్లు చూపించి కరీంనగర్‌కు చెందిన వైద్యుల మహేందర్ రెడ్డి వద్ద ఎనిమిది లక్షల రూపాయలు తీసుకుని అమ్మారు. రిజిస్ట్రేషన్ చేసి మోకా ఇప్పిస్తామని చాలా రోజుల నుంచి తప్పించుకుంటున్నారు. భూమి చూపెట్టమని అడిగితే అంతు చూస్తామని బెదిరించారు. దీంతో వైద్యుల మహేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం సోమవారం సుద్దాల వెంకటస్వామి, కొత్తూరు అంజనేయులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న రైతులు

రామడుగు, మే 20: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి ఊర చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను గ్రామ రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఊర చెరువులో రాత్రి పగలు అనే తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించడంతో సమీప బావులలో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వే నిర్మాణ పనులకు చెరువులోని మట్టిని తీయడానికి అనుమతులు తీసుకున్నట్లు సదరు కాంట్రాక్టర్ బెదిరిస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా మట్టి తరలిస్తున్న సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇప్పటికైనా అక్రమ మట్టి తరలింపును నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

బీపీఎంపై కేసు నమోదు

గొల్లపల్లి, మే 20: మండలంలోని చిల్వాకోడూర్ తపాల శాఖలో ఖాతాదారులకు సంబంధించిన 11.60 లక్షల రూపాయలు స్వాహా చేసిన బీపీఎం దూడ నల్ల పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ సోమవారం తెలిపారు. చిల్వాకోడూర్ బీపీఎంగా విధులు నిర్వహిస్తున్న నల్ల పోచయ్య తపాల శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాల్లో ఖాతాదారులు తమ డబ్బులను పొదుపు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి ప్రజలు తపాల శాఖలో పొదుపు చేసుకుంటున్నారు. బీపీఎం ఖాతాదారుల నుంచి తీసుకున్న సొమ్మును వారి వారి ఖాతాల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు ఇటీవల వెలుగు చూసింది. బాధితులు గొల్లపల్లిలోని తపాల శాఖ అధికారికి ఫిర్యాదు చేయగా, విచారించిన అధికారులు ఖాతాదారుల డబ్బును స్వాహా చేసినట్లు తేలింది జగిత్యాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టఆఫీస్ జి వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీపీఎం పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం : ఒకరి అరెస్టు

ఇల్లంతకుంట, మే 20: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని యువకులను మోసం చేసిన సిరిసిల్ల పట్టణానికి చెందిన కారునాథం శివకృష్ణను సోమవారం అరెస్టు చేసినట్లు సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన ర్యాగటి మల్లయ్య ఇదే గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బోల్ల రాము, తిప్పరవేని చంద్రశేఖర్, దారం శ్రీనివాస్‌రెడ్డికి శివకృష్ణను పరిచయం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సింగరేణి ఉద్యోగాలు ఇప్పిస్తానని శివకృష్ణ వారివద్ద నుంచి 6.50 లక్షల రూపాయలు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి సోమవారం ఇల్లంతకుంట బస్టాండులో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటే యువకులు నమ్మిమోసపోవద్దని ఆయన అన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోనరావుపేట, మే 20: కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్సై అంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన సందెవేణి రేణుక (23) కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో తన అమ్మమ్మ ఇంటికి వచ్చి ఆదివారం రాత్రి తిరిగి ఆటోలో బయలుదేరింది. కొలనూరు గ్రామంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రేణుక సోదరుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన ఇసుక లారీ

రామగిరి, మే 20: మండలంలోని నాగేపల్లి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో అదుపు తప్పిన ఇసుక లారీ కారును ఢీ కొట్టి రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. మంథని- పెద్దపల్లి ప్రధాన రహదారి నాగేపల్లి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో సోమవారం ఓ లారీ వేగంగా వస్తూ అదుపు తప్పింది. బ్యాంక్ ఎదుట నిలిపి ఉంచిన ఓ కారును ఢీకొంది. అనంతరం రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని స్థానికులు అన్నారు.

జేఎన్టీయూ కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్

ఉత్తర్వులు జారీచేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్‌ను నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ జగిత్యాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను సిరిసిల్ల జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. అక్కడ ప్రిన్సిపాల్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ప్రొఫెసర్ చంద్రమోహన్‌ను హైదరాబాద్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి తీసుకువచ్చారు.

మరోవైపు జగిత్యాల జేఎన్‌టీయూ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈసీఈ ప్రొఫెసర్ ప్రభాకర్‌ను అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. తాజా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

గంభీరావుపేటలో సైబర్ మోసం

● రైతుల బ్యాంక్ ఖాతాల నుంచి రూ.3 లక్షల 24 వేలు స్వాహా ● వాట్సాప్‌లో ఫేక్ లింక్ మెసేజ్‌లు

గంభీరావుపేట, మే 20: గంభీరావుపేట మండలంలో పలువురు సైబర్ మోసానికి బలయ్యారు. సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లో ఫేక్ లింక్‌ల మెసేజ్‌లు పంపుతూ బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు స్వాహా చేస్తున్నారు. నాలుగు రోజుల వ్యవధిలో రూ. 3 లక్షల 24 వేల 900 వేలు సైబర్ నేరగాళ్లు కొట్టేయడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. మోసపోయిన నలుగురు బాధితులు రైతులే కావడం గమనార్హం. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి నుంచి రూ. 45 వేలు, దండు నరేష్ ఖాతా నుండి రూ. 44 వేల 900, లంగారెడ్డిగారి రాజశేఖర్‌రెడ్డి ఖాతా నుండి 50 వేలు, కోటయ్యగారి లత ఖాతా నుంచి రూ 1 లక్షా 85 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. రైతులు వరి ధాన్యం అమ్మిన డబ్బులు ఇటీవల యూనియన్ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. డబ్బులు జమ అయిన కొద్ది రోజుల్లోనే వీరి ఖాతాల నుంచి డబ్బులు పోయినట్టు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో నలుగురు బాధితులు బ్యాంక్ వద్దకు పరుగులు తీశారు. ఫేక్ లింక్‌ల మెసేజ్‌ను ఓపెన్ చేయడం వల్లే బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు లూటీ అయినట్టు బ్యాంక్ అధికారులు బాధితులకు చెప్పారు. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధితులు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లు ఏపీకే పేరిట పంపిన ఫేక్ లింక్‌ను ఓపెన్ చేయడం వల్లే డబ్బులు స్వాహా అయ్యాయని పోలీస్‌లు గుర్తించారు. ఆ ఫేక్ లింక్ క్లిక్ చేసిన వెంటనే సెల్‌ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లి, ఓటీపీ ద్వారా డబ్బులను కొట్టేస్తున్నట్టు పోలీస్‌లు నిర్ధారించారు. ఆరుగాలం శ్రమించిన వరి ధాన్యం డబ్బులు సైబర్ నేరగాళ్ల పరం కావడంతో రైతు కుటుంబాలను తీవ్రంగా బాధించింది. పోయిన మా డబ్బులు తిరిగి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ఫేక్ లింక్ మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు, పోలీస్‌లు ప్రజలకు సూచించారు.


డబ్బులు పోయాయని ఆవేదనతో ఉన్న రైతులు

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

శంకరపట్నం, మే 20: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో టిప్పర్ ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసులు.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన పర్వతం ఎల్లయ్య (51) శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన తన కూతురు ఊర పద్మ ఇంట్లో రెండు నెలలుగా ఉంటూ చిరు వ్యాపారాలు చేసుకుంటున్నాడు. సోమవారం వ్యక్తిగత పనిపై బయటికి వెళ్లాడు. తాడికల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు రాగానే జాతీయ రహదారి 563 నిర్మాణ సంస్థ బుల్డ్‌కాస్‌కు చెందిన ఓ టిప్పర్ హుజూరాబాద్ వైపు వెళ్తూ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ టైర్ ఎల్లయ్యపై నుంచి వెళ్లగా తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన సునీల్‌రాం పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి సిబ్బందితో చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన 5నిమిషాలకే ప్రమాదం రూపంలో మృత్యువు కబలించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కొడుకు పర్వతం నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. న్యాయం చేయాలని మృతుడి కుటుంబీకులు రాస్తారోకో చేయగా హుజూరాబాద్ టౌన్ సీఐ రమేష్‌తో పాటు సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం, అదనపు సిబ్బంది సంఘటన స్థలానికి చేసుకొని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు.

టిప్పర్లే మృత్యు శకటాలు

● తాడికల్‌లో ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరి మృతి

శంకరపట్నం : శంకరపట్నం మండలంలో రహదారి నిర్మాణ సంస్థ టిప్పర్లు ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నాయి. కరీంనగర్-వరంగల్ రహదారిపై ఐదు రోజుల వ్యవధిలోనే తాడికల్‌లో రహదారి నిర్మాణ సంస్థ టిప్పర్లు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గత బుధవారం ఆయిల్ ట్యాంకర్ ప్రజలపై దూసుకు వచ్చిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా సోమవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో పలు యాక్సిడెంట్లకు కారణమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారి వెంట ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతులో పెట్టుకొని రావాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డ్రైవర్ల అధిక వేగం, భారీ వాహనాలు, ఓవర్‌లోడ్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన చర్యలు చేపట్టి ఇక మీదట రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

● రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

సిరిసిల్ల క్రైం మే 20: రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జోగినిపల్లి భాస్కర్‌రావు సోమవారం ఏసీబీకి చిక్కాడు. కాంట్రాక్టర్ వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బాధితుడి వివరాల ప్రకారం.. జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన కాంట్రాక్టర్ వెంకటేశం అదే గ్రామంలో ఖబ్రస్థాన్ ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. రూ.4.35 లక్షలతో నిర్మించిన ఖబ్రస్థాన్ ప్రహరీ బిల్లు ఫైల్‌ను చీఫ్ ప్లానింగ్ అధికారికి పంపేందుకు సీనియర్ అసిస్టెంట్ జోగినిపల్లి భాస్కర్‌రావును కలిశాడు. నాలుగు నెలలుగా తిప్పుకుంటున్న భాస్కర్‌రావు రూ.8 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ వెంకటేశం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. నాలుగు రోజులుగా వలపన్నిన ఏసీబీ అధికారులు సోమవారం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో వెంకటేశం నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటుండగా భాస్కర్‌రావును పట్టుకున్నారు. ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ కాంట్రాక్టర్ వెంకటేశం వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ బిల్లుకు సంబంధించిన ఫైల్స్‌తోపాటు పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్‌ను కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఏ అధికారైనా లంచం డిమాండ్ చేస్తే ఫోన్ : 9154388954 సమాచారం అందించాలని, వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఏసీబీ సీఐలు కృష్ణకుమార్, తిరుపతి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


బాధితుడు జి. వెంకటేశ్


ఏసీబీకి పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు

గూడెం వద్ద గోదావరిలో మునిగి యువకుడి మృతి

దండేపల్లి,మే 20: హనుమాన్ మాలధారణ స్వీకరించేందుకు వచ్చిన యువకుడు గోదావరి నదిలో మునిగి మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గోదావరి వద్ద సోమవారం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన దుర్గం కీర్తన్‌గౌడ్ అలియాస్ రిషీ (19) అతని స్నేహితులు కోడూరి శేఖర్, గర్రెపల్లి వినయ్, వెగ్గలం అజయ్, దూలం మురళి, కొమ్మ సాయితో కలిసి హనుమాన్ దీక్ష స్వీకరించేందుకు గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలోని అనుబంధ హనుమాన్ ఆలయానికి వచ్చారు. దీక్షకు ముందు స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి గోదావరి నదిలో దిగారు. కీర్తన్‌గౌడ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో జాలర్లు గాలింపు చర్యలు చేపట్టగా అప్పటికే కీర్తన్‌గౌడ్ మృతి చెందాడు. మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కీర్తన్‌గౌడ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి దుర్గం తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.


కీర్తన్‌గౌడ్(ఫైల్)

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్

కరీంనగర్ టౌన్, మే 20:ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాలోని అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. వర్షం వల్ల మొలకెత్తిన, తడిసిన ధాన్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాంటి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్‌కు ఉపయోగించేలా చూడాలన్నారు. ఈ మేరకు రైస్‌మిల్లర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల సిరిసిల్ల అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, శ్యాంప్రసాద్‌లాల్, రాంబాబు, బీమానాయక్, పౌర సపరఫరాల జిల్లా మేనేజర్ రజనీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డిఆర్‌డిఓ శ్రీధర్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్, మే 20: అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి, వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర సంచాలకులు ఆర్ వి కర్ణన్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంను సోమవారం జిల్లా ప్రత్యేకాధికారి కర్ణన్ పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణన్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో మాట్లాడారు. వారి నుంచి కొనుగోళ్ల ప్రక్రియ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


గర్రెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కర్ణన్

నక్కను రక్షించిన ఫారెస్టు అధికారులు

శంకరపట్నం, మే 20: వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిన నక్కను ఫారెస్టు అధికారులు బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. సోమవారం మండలంలోని మొలంగూర్ గ్రామ శివారులో ముప్పిడి విజేందర్‌రెడ్డి వ్యవసాయ బావిలో నక్క పడిందని సమాచారం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, బీటీ ఆఫీసర్ తక్షణమే అక్కడికి చేరుకొని బావి నుంచి నక్కను బయటకు తీసి ప్రాణాపాయం నుంచి కాపాడారు.


బావినుంచి బయటకు తీసిన నక్క

జంట హత్య కేసులో నిందితుల అరెస్ట్

● వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ

ధర్మపురి, మే 20: బుగ్గారం మండలంలోని గోపులాపూర్‌లో దీటి శ్రీనివాస్, దీటి మహేష్‌లను హత్యచేసిన కేసులో ఏడుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సోమవారం ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్ట్ చేసి చూపించి హత్య వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోపులాపూర్ గ్రామంలో దీటి తార, ఆమె కొడుకు దీటి శ్రీనివాస్ 2018లో నాగుల అంజయ్య వద్ద ఇంటిని కొన్నారు. అదే ఇంటిని 2017లో అంజయ్య తమకు విక్రయించాడని తార ఇంటి పక్కనే ఉన్న బుర్ర లక్ష్మి ఆమె కొడుకులు నాగరాజు, నవీన్ కోర్టును ఆశ్రయించారు. 2023లో కోర్టు సివిల్ కేసును కొట్టివేసింది. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నెల 16న రాత్రి తార, కొడుకు శ్రీనివాస్, దీటి మహేష్, నవీన్ కుటుంబ సభ్యులకు గొడవ జరిగింది. దీంతో శ్రీనివాస్‌ను అతడికి సహకరిస్తున్న మహేష్‌ను ఎలాగైనా చంపాలని నవీన్ అనుకున్నాడు. అదే రోజు రాత్రి నవీన్ స్నేహితులు పవన్, రాజేందర్, వెంకటేష్, గంగారాజం అలియాస్ మనోజ్, శేషు, అజయ్‌లతో కలిసి శ్రీనివాస్, మహేష్‌లపై ఇనుప పైపులు, కర్రలతో విచక్షణారహితంగా కొట్టి అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా మహేష్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుగ్గారం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప పైపులు, కర్రలు, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సంఘటనకు కారణమైన బుర్ర లక్ష్మి, నాగరాజు, వెంకటమ్మ, పూజలపై కూడ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు శ్రీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, సతీష్, ఉమాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం


కొండస్వామి ఆలయంలో కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే, 20: మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండ స్వామి ఆలయంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో వేదపండితుడు చక్రపాణి మాధవచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి గ్రామ పంచాయతీ నుంచి పుస్తె, మట్టెలను ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ స్థులు డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం జరిపారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తరించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామాభివృద్ధి, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

ధర్మపురిలో వైభవంగా నృసింహ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 20: నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాస పూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్త హారతులు, తులసీ అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అన్నకూటోత్సవంలో భాగంగా ఉదయం పలు రకాల ప్రసాదాలతో మహా నివేదన, సప్త హారతులు, భజనా కార్యక్రమాలు నిర్వహిం చారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


తులసీ దండలతో స్వామివారల అలంకరణ

రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ట్రాలీల పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కోల్‌సిటీ, మే 20: గోదావరిఖని గంగానగర్‌లోని మిలీనియం క్వార్టర్స్ సమీపంలో ఆదివారం రాత్రి రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ట్రాలీలను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. టీఎస్03యూడీ0220 నంబర్ గల వాహనంలో 65బస్తాలు, టీఎస్22టీ8686 నంబర్ గల వాహనంలో 50బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్‌చేసి బేగంపేటకు చెందిన పోలుదాసరి సంతోష్, తూర్పాటి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఇన్స్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

యారన్ సబ్సిడీ సమస్య పరిష్కరించాలి


సిరిసిల్ల చేనేత జౌళిశాఖ ఎదుట ధర్నా చేస్తున్న మరమగ్గాల కార్మికులు

సిరిసిల్ల రూరల్, మే 20: బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు అందించే పదిశాతం యారన్ సబ్సిడీ సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట సోమవారం యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి ఏకపక్ష నిర్ణయాలతో సిరిసిల్ల నేతన్నల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులను తగ్గించకుండా వెంటనే అందించాలన్నారు. నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన దాదాపు 10 నెలల పెండింగ్ డబ్బులను చెల్లించాలన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 24వ తేదీన సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని కమిషనరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్క దేవదాస్, గుండురమేష్, కంది మల్లేశం, బెజుగం సురేష్, మూషం శంకర్, స్వర్గం శేఖర్, రవీందర్, పోచమల్లు, సదానందం, శ్రీనివాస్, రాజమౌళి, శ్రీధర్, నరేష్, దామోదర్, భాస్కర్, తిరుపతి, అశోక్, శేఖర్, విజయ్, సంపత్, శంకర్, రవి, వెంకటేష్, సత్యనారాయణ, రమేష్, సతీష్, లక్ష్మణ్, మల్లేశం, మనోహర్, కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీ దోస్త్ టీం ఏర్పాటు : వీసీ

గణేశ్‌నగర్,మే 20: శాతవాహన యూనివర్సిటీ దోస్త్ టీంను మంగళవారం ఏర్పాటు చేయనున్నట్లు శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.మల్లేష్ తెలిపారు. యూనివర్సిటీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సూరపల్లి సుజాత- 9849468281,టెక్నికల్ అసిస్టెన్స్‌గా మార్క సంతోష్‌కుమార్-9030402257, గొల్లె మారుతి-98666 25885, సపోర్టింగ్ స్టాఫ్‌గా ప్రవీణ్‌లను నియమించారు. యూనివర్సిటీకి సంబంధించి దోస్త్ సేవలకు టీం పనిచేస్తుందని వీసీ తెలిపారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 11మంది రైతులు 125క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించారు.

ప్రమాదవశాత్తు ఇంటిలో మంటలు

● కాలిబూడిదైన రెండు లక్షల నగదు, ఆభరణాలు

సుల్తానాబాద్, మే 20: సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు మంటల్లో రెండు లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన ఊర కొండయ్య కుటుంబం ఒకరి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సోమవారం నిత్యావసర సరుకులను తీసుకురావడం కోసం ఇంటికి తాళం వేసి కరీంనగర్ వెళ్లారు. ఇంట్లో మంటల చెలరేగి పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే తాళం పగులకొట్టి లీకేజీ అయి ఉన్న గ్యాస్ సిలెండర్‌ను బయటకు విసిరేసి ప్రమాద తీవ్రతను తగ్గించారు. అప్పటికే ఇంట్లో ఉన్న మంచాలు బీరువా ఇతర సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఉన్న రెండు లక్షల నగదుతో పాటు వెండి బంగారు నగలు కూడా మంటల్లో కాలిపోయాయి. సంఘటన స్థలానికి కరీంనగర్ నుంచి అగ్నిమాపక దళ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబానికి యాభై కిలోల బియ్యం తదితర నిత్యావసర సరుకులను బట్టలను అందించారు. కాగా అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ అంజయ్య తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.


కాలిపోయిన నోట్లను పరిశీలిస్తున్న భాధితుడు

అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన సదస్సు

కరీంనగర్ టౌన్, మే 20: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బేడ బుడగజంగాల కాలనీలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాత ఇనుప సామాను రంగంలో పనిచేసే కార్మికులకు, వివిధ ప్రదేశాల్లో కూలి పనులు చేస్తున్న వారికి కార్మిక చట్టాలు వర్తిస్తాయని తెలిపారు. అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులు, కూలీలు తప్పనిసరిగా స్థానిక కార్మిక అధికారి కార్యాలయంలో లేబర్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్‌తో పాటు, లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, కార్మికులు ఆశావర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

ముదుఘంటికలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్, మే 20: డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి రచించిన ముదుఘంటికలు పుస్తకాన్ని సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి పలు అవార్డులు పొందడమే కాకుండా కవితారచనలు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం కలెక్టర్‌ను సుధాకర్‌రెడ్డి సన్మానించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం సభ్యులు

కరీంనగర్ టౌన్, మే 20: నగరంలోని జ్యోతినగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీలత టవర్స్ సమీపంలో మజ్జిగ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సూర శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గర్రెపల్లి చంద్రం, కోశాధికారి తిరుమల లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి రాచకొండ రజనీకాంత్, గాదె రాజేశం, జాయి అనిల్, రావికంటి వైకుంఠం, పైడ ప్రభాకర్, ఈగం వీరేశం, ఆయిల్ సుధాకర్, పెద్ది మల్లేశం, కల్పన, రాధ, కముటాల హరీష్, నార్ల వేణుగోపాల్, వి.రవీందర్, అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తాడ వీరారెడ్డి, దూలూరి జగన్మోహన్, తిరుపతి రావు, శ్రీలత టవర్స్ అధ్యక్షురాలు సంపూర్ణ శీల, శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ మాట్లాడుతూ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి సోమవారం దాదాపు 250 నుంచి 300 మందికి ఉచితంగా మజ్జిగను పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

'రైతులపై బీజేపీ మొసలి కన్నీరు'

కరీంనగర్ అర్బన్, మే 20: నల్లచట్టాలు తీసుకువచ్చి రైతుల నడ్డి విరిచే ప్రయత్నం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై రైతులు తిరగబడితే చట్టాలను ఉపసంహరించుకున్న చరిత్ర బీజేపీదని, ఇప్పుడు కేవలం ఉనికి కాపాడుకునేందుకు రైతు కళ్లాల చుట్టూ తిరుగుతూ రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చుతుండటం హాస్యాస్పదంగా ఉందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్వింటాలుకు 5 నుంచి 10 కిలోల తరుగు పేరిట దోచుకుని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వాటాలు పంచుకున్నారని ఆరోపించారు.

ఎటువంటి కోతలు విధించకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేస్తుంటే ఉనికి చాటుకోవడానికి భాజపా నాయకులు డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. వర్షాకాలం పంట నుండి రూ.500లు బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంగా చెప్పినప్పటికీ బీజేపీ నాయకులు రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. సన్న వడ్లకే బోనస్ ఇస్తారంటూ బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నదని అన్నారు. వరిధాన్యం తూకంలో కోతలు విధిస్తున్నట్లు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు.

'అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

హుజూరాబాద్, మే 20: అనుమతులు లేని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అభిలాష్ సోమవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసి, కార్పొరేట్ విద్యా వ్యవస్థను రద్దు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలను పూర్తిగా రద్దు చేయాలన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సంబంధిత అధికారులు పరిష్కారం చూపని యెడల రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

327యూనియన్‌లో భారీగా చేరికలు

హుజూరాబాద్, మే 20: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 యూనియన్‌లో భారీగా చేరికలు జరిగాయి. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో డివిజన్‌లోని 1104యూనియన్‌కు చెందిన సుమారు 30మంది కార్మికులు 327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, ఓదెలు, సదయ్య, సుధాకర్, సంజీవరావు, లక్ష్మణ్, గిరి, అయిలేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుజూరాబాద్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

హుజూరాబాద్, మే 20: హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో 1997-98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కాకతీయ హైస్కూల్‌లో 26ఏళ్ల కింద చదువుకున్న పదో తరగతి విద్యార్థులకు చదువు నేర్పించిన గురువులను పూజించి సన్మానించారు. విద్యార్థి దశలో తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో గురువులు రాజయ్య, సుభాష్, చంద్రశేఖర్, పద్మారెడ్డి, ప్రతాపరెడ్డి, శ్రీనివాస్, పున్నంచందర్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల పాలనలో
పారిశుధ్యంపై పట్టింపు కరువు

సైదాపూర్, మే 20: ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుధ్య పనులపై పట్టింపు లేకుండా పోయిందని సైదాపూర్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో దోమలు, ఈగలతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశముందని, అధికారులు పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని వెన్కేపల్లి ఎస్సీ కాలనీలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని దాంతో ఈగలు, దోమలు ప్రబలుతున్నాయని మాజీ వార్డు సభ్యుడు గడ్డం శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీలో పిచ్చి మొక్కలు పేరుక పోయాయన్నారు. అటు గ్రామ ప్రత్యేకాధికారి గానీ, పంచాయతీ కార్యదర్శి గానీ కన్నెత్తి చూడడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలి

-జిల్లావ్యాప్తంగా తహసీల్దార్లకు బీజేపీ నాయకుల వినతిపత్రాలు అందజేత



కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ రూరల్, మే 20: రైతు పండించిన వరి ధాన్యానికి ప్రతి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని సోమవారం కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, ఓబీసీ నాయకులు చిందం అశోక్, జిల్లా నాయకులు దాడి సుధాకర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, రాముల కుమార్, బింగి కరుణాకర్, జెల్ల సుధాకర్, కొండాల్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

●జమ్మికుంట: బీజేపీ నాయకులు సోమవారం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, పల్లపు రవి, కైలాసకోటి గణేష్, ఇటుకల స్వరూప, తుడి రవిచంద్రరెడ్డి, కొమ్ము అశోక్ పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి నాయకులు కంకణాల సురేందర్‌రెడ్డి, పవన్‌రెడ్డి, రాంబాబు, మధుకర్‌రెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

●చొప్పదండి: తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షుడు మావురం సుదర్శన్‌రెడ్డి, నాయకులు కోటేష్, బొల్ల గట్టయ్య పాల్గొన్నారు.

●మానకొండూర్: బీజేపీ నాయకులు తహసీల్దార్ రాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, భాస్కరాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు రావుల శంకరాచారి పాల్గొన్నారు.

●తిమ్మాపూర్ (మానకొండూర్): బీజేపీ నాయకులు తహసీల్దార్ కనుకయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, జిల్లా ఈసీ మెంబర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

●గంగాధర: బీజేపీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, పంజాల ప్రశాంత్ పాల్గొన్నారు.

●చిగురుమామిడి: బీజేపీ నాయకులు తహసీల్దార్ ఇప్పా నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్, బీజేవైఎం హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జేరిపోతుల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

●శంకరపట్నం: బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దాసరపు నరేందర్, కొయ్యడ అశోక్, దొంగల రాములు పాల్గొన్నారు.

● వీణవంక: తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు నర్సింహరాజు, సమ్మిరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, రవీందర్, కుమార్, నాని, సునీల్, అశోక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 20: జిల్లాలో 2023-25 సంవత్సరానికిగాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ప్రవేశము నిమిత్తము ఐదు సీట్లు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. 3వ తరగతిలో లంబాడ బాలురకు ఒకటి, ఎరుకల బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి కేటాయించామన్నారు. 5వ తరగతిలో ఎరుకల బాలురకు ఒకటి, 8వ తరగతిలో లంబాడ బాలికలకు ఒకటి చొప్పున కేటాయించామన్నారు. దరఖాస్తులు జూన్ 6 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కరీంనగర్గారి కార్యాలయములో సమర్పించాలని తెలిపారు.

ఎన్‌సీసీ అధికారికి సన్మానం



ఎన్‌సీసీ అధికారిని సన్మానిస్తున్న వివేకానంద ప్రిన్సిపాల్

కరీంనగర్ స్పోర్ట్స్, మే20: వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్‌సీసీ అధికారిగా, కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న క్యాప్టెన్ కె.కిరణ్ జ్యోతి శిక్షణ పూర్తి చేసుకొని మేజర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆమెను కళాశాలలో సన్మానించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిఎచ్.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కిరణ్ జ్యోతి గత నెల ఏప్రిల్15 నుంచి ఈనెల మే 5 వరకు గ్వాలియర్‌లో జరిగిన మేజర్ శిక్షణను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 9 ఎ బెటాలియన్‌లో మొదటి మహిళా మేజర్‌గా గుర్తింపు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేజర్ కిరణ్ జ్యోతి మాట్లాడుతూ ఈ శిక్షణలో తను యోగా కావా తూ,మ్యాప్ రీడింగ్, ఫైరింగ్ వంటి అంశాలపై తర్ఫీదు పొందినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్, ఏవో బి శ్రవణ్ కుమార్ ఏ సి ఓ బి సంపత్ కుమార్, రామేశ్వరరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డి. సాగర్ వివిధ విభాగ అధిపతులు అధ్యాపకులు ఎన్‌సిసి క్యాడెట్స్ అభినందనలు తెలిపారు.

'యువకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి'



మాట్లాడుతున్న దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు

సుభాష్‌నగర్, మే20: ముస్లిం యువతిని ప్రేమించాడన్న కారణంతో దళిత యువకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన ముస్లిం యువతి దళిత సామాజిక వర్గానికి చెందిన చింత భరత్ ప్రేమించుకున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల క్రితం సదరు యువతీ యువకునికి ఫోన్ చేసి తమను తీసుకెళ్ళి వివాహం చేసుకోవాలని కోరినట్లు తెలిపారు. దీంతో భరత్ యువతిని తీసుకెళ్లే క్రమంలో రేకుర్తి వద్ద కొందరు ముస్లిం యువకులు వారిని వెంబడించి భరత్‌ను విచక్షణ రహితంగా కొట్టారని ఆరోపించారు. వారిలో బీఆర్ఎస్ నాయకుడు రహీం, ఎంఐఎం నాయకుడు అబ్బాస్ సమీకి సమాచారం ఇవ్వగా సమీ సూచనల మేరకు యువతీ యువకులను నిర్బంధించి యువకున్ని కులం పేరుతో దూషిస్తు చిత్రహింస లకు గురిచేశారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి అబ్బాస్ సమీతో పాటు అతని అనచరులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో గజ్జెల ఆనందరావు, గోష్కిశంకర్, ఆవారు లత, గసికంటి శ్రీనివాస్, బోయినపల్లి చంద్రయ్య గండి గణేష్, తాండ్ర శంకర్, తాటిపల్లి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

●భరత్ అనే యువకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, భజరంగ్‌దళ్ విభాగ కన్వీనర్ తోట ప్రదీప్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఐఐటీ జేఈఈ బీఆర్క్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



కరీంనగర్ టౌన్, మే 20: సోమవారం ప్రకటించిన ఐఐటీ జేఈఈ2024 బీఆర్క్, బి.ప్లానింగ్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయి ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. వినాయక్ గుగులోత్ బీఆర్క్‌లో 403వ ర్యాంకు, బి.ప్లానింగ్‌లో 375వ ర్యాంకు సాధించాడు. బీఆర్క్‌లో కె.హర్షితరెడ్డి 535, వై.శివమణి 936, ఏ.మౌనిక 1239, టి.పూజిత 1359, ఐ.యోషిత 2096, సి.అర్షిత 2439, ఎస్.సాయిప్రసన్న2511, ఆర్. మణిశ్రీ 3516వ ర్యాంకు సాధించగా కె. శ్రేష్ఠ బి.ఆర్క్‌లో 4292ర్యాంకు, బి. ప్లానింగ్ లో 2498 వ ర్యాంకు సాధించింది. జాతీయస్థాయి అత్యున్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.

వ్యవసాయ మార్కెట్ స్థలం పరిశీలన



వెంకటేశ్వర్లపల్లి శివారులో మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



పనులు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్

సైదాపూర్, మే 20: సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులోని 46 సర్వేనంబర్‌లోగల భూమి వ్యవసాయ మార్కెట్ యార్డుకు కేటాయించగా ఆ భూమిని సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డుకు రోడ్డు ఎలా తీస్తే బాగుంటుందని ఆరా తీశారు. చుట్టు పక్కల రైతులతో మాట్లాడాలని మండల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ బాబు, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, హుజూరాబాద్ మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజా, పీఆర్ ఏఈ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

● మోడల్ స్కూల్ సమస్యల పరిష్కారానికి హామీ

సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామ శివారులోని మోడల్ స్కూల్, ఆకునూర్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాల సమస్యల పరిష్కారానికి అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హామీ ఇచ్చారు. వర్షాకాలంలో వరదలకు మోడల్ స్కూల్ జలమయం అవుతున్నదని, దాంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, త్వరితగతిన ప్రహరీ నిర్మించాలని, కేజీబీవీ పాఠశాలలో డ్రైనేజీ సమస్య ఉందని ఆ సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సానుకులంగా స్పందించారు. వెంటనే పాఠశాలలోని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వాటికి సంబంధించిన నివేదికను తయారు చేయాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

● పాఠశాలలను సందర్శించిన ప్రత్యేకాధికారి

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను జిల్లా ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఆబాది జమ్మికుంటలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక బాలుర పాఠశాల, ప్రాథమిక బాలికల పాఠశాల, ఎస్సీ కాలనీలోని పాఠశాలల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలల్లో చేపడుతున్న పనుల్లో ప్రమాణాలు పాటించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచే ప్రయత్నం చేయాలని ప్రాధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, ప్రాధానోపాధ్యాయులు జె పద్మ, పూర్ణచందర్, మనెమ్మ, మున్సిపల్ వర్క్ ఇన్స్‌పెక్టర్లు ఆకాష్, సాయి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మౌనిక, స్వరూప, షమీమ్ బేగం, సీఆర్పీలు సురేష్, రవి, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, మే 20: హౌసింగ్ బోర్డు కాలనీ పడవ జంక్షన్ వద్ద మూడో టౌన్ పోలీసులు సోమవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీలో సుభాష్‌నగర్‌కు చెందిన జక్కుం సాయికృపాకర్(19) అలియాస్ మున్నా గంజాయితో పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద 1.5 కిలోల నిషేధిత గంజాయిని పట్టుకున్నట్లు మూడో టౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. మున్నా వృత్తి రీత్యా ఒక ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి వచ్చే జీతం డబ్బులు సరిపోక జల్సాలకు అలవాటై పక్క రాష్ట్రాలకు వెళ్లి అక్కడి వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, కరీంనగర్‌లో అలవాటున్న యువకులకు విక్రయిస్తున్నాడు.

వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడని విచారణలో వెల్లడైనట్లు సీఐ తెలిపారు. నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నందుకు నింది తుడిని అదుపులోకి తీసుకుని ఎన్‌డీపీఎస్ కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

అనుమతి లేని షెడ్లను తొలగించిన మున్సిపల్ అధికారులు



హుజూరాబాద్‌లో అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగిస్తున్న డీటీఎఫ్ అధికారులు

హుజూరాబాద్, మే 20: హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని శాంత కాలేజీ సమీపంలోని సర్వే నంబరు 24/ఏలో మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన రెండు షెడ్డులను సోమవారం మున్సిపల్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ అధికారులు తొలగించారు. గతంలో అక్రమంగా అనధికారంగా నిర్మించిన రెండు షెడ్లను తొలగించాలని పలుమార్లు నోటీసులు పంపించినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పోలీస్ బందోబస్తు, మున్సిపల్ సిబ్బంది ద్వారా అట్టి అక్రమ షెడ్లను తొలగించామని డీటీఎఫ్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, అశ్వినిగాంధీ, టీపీఎస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, మే20: నగరంలో మంగళవారం ఉదయం 8:30 గంటల నుండి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. గీతాభవన్ ఫీడర్‌లో పద్మానగర్, రాంనగర్, మంకమ్మతోట, వాసరా హాస్పిటల్, రాజీవ్ పార్కు, సహజ కృష్ణా ఏరియా, ధన్గర్‌వాడి స్కూల్, ఓల్డ్‌లేబర్‌అడ్డ, యశోద హాస్పిటల్ ఏరియా, సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ, గోదాంగడ్డ, భగత్‌నగర్‌పై ప్రాంతం, శ్రీరామ్‌నగర్ కాలనీ ఫీడర్‌లో శ్రీరాంనగర్ కాలనీ, ఆదిత్య నగర్, విద్యానగర్, కొత్తయస్వాడ, సలేహ్‌నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరం ముగింపు

కరీంనగర్ కల్చరల్, మే 20: నగరంలోని జ్యోతీనగర్ అండాళ్‌గోష్ఠిలో వావిలాలపల్లి వికాసతరంగిణి-జెట్ (108) శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరం సోమవారంతో ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథులుగా డాక్టర్ చాట్ల శ్రీదర్, డాక్టర్ సునీత హాజరై మాట్లాడుతూ చిన్న జీయర్‌స్వామి ఆశీస్సులతో ప్రతీయేటా చిన్నారులకు ప్రజ్ఞ శిబిరం నిర్వహించడం అదృష్టమని అన్నారు. చిన్నారులు నేర్చుకున్న విలువైన అంశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. పలు అంశాలపై నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కె వరప్రసాదాచార్యులు ఆధ్యాత్మిక సందేశం, ప్రజ్ఞ శిక్షణ వైశిష్ట్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వికాసతరంగిణి అధ్యక్ష కార్యదర్శులు కె గౌతమరావు, యాద కిషన్, చీఫ్ కో ఆర్డినేటర్ అరుణా భూపతిరావు, చీటి విజయమ్మ, ఎం అశోక్‌రావు, సిరికొండ వేంకటేశం, పి రవీందర్‌రావు, రాజేందర్‌రెడ్డి, వేణుగోపాలాచార్య, సునందతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదానం

భగత్‌నగర్, మే 20: మేము సైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న పుట్టిన రోజును పురస్కరించుకుని రేకుర్తిలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదల పిల్లలకు బొమ్మలు, స్టేషనరీ, మహిళలకుచీరలతో పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకను పేద పిల్లల మధ్య జరుపుకోవడం సంతోషంగాఉందన్నారు. నిరుపేద కుటుంబాల్లోని పిల్లలకు మంచిగా చదువుకోవడానికి వీలుగా బుక్కులు, పెన్నులు, స్టేషనరీ, మహిళలకు చీరలు, గాజులు పంపిణీ చేశామన్నారు.

వైభవంగా ముగిసిన ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, మే20:కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో నిర్వహిస్తున్న శ్రీ జీల్గుల మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గత రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నాడు గ్రామంలో ఎడ్ల బండ్లతో ఊరు చుట్టు ప్రదీక్షణలు చేశారు. సోమవారం నాగవెల్లి పట్నం వేసి అనంతరం బోనాలతో ఆలయం చుట్టు ప్రదీక్షణలు నిర్వహించి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సాయిని మధు, కార్యదర్శి గోనె ఎల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించగా చివరి రోజు భక్తులు బారిగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలయన్స్‌క్లబ్ క్యాబినెట్ ఇస్టాలేషన్

సుభాష్‌నగర్, మే 20: అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 137 జిల్లా క్యాబినెట్ ఇస్టాలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం స్థానిక కోతిరాంపూర్‌లోగల అచీవర్స్ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ చెర్మాల వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప గవర్నర్-1గా చీకోటి శ్రీనివాస్‌గాంధి, ఉప గవర్నర్-2గా కొంజర్ల మహేశ్, జిల్లా క్యాబినెట్ కార్యదర్శిగా ఎస్ఎల్వీఎంఎస్ఎం ప్రసాద్, జిల్లా క్యాబినెట్ కార్యదర్శిగా ఎం విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా సోమారపు వెంకటేశ్వర్లుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కోల అన్నారెడ్డి, ఇంటర్నేషనల్ కమిటి చైర్మెన్ డాక్టర్ కోల అన్నారెడ్డి, గాలిపెల్లి నాగేశ్వర్, సిరిపురం సత్యనారాయణ, ఈద కుమారస్వామి, పసుల సతీష్, పోలు సత్యనారాయణ, సిద్దుల బ్రహ్మానంద్, కొమురయ్య పండుగ నాగరాజు, మాటేటి శ్రీనివాస్, దేవులపల్లి రేణుక పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కరీంనగర్ క్రైం, మే 20 : కరీంనగర్ గౌతమినగర్‌కు చెందిన కాడె శిరీష(20) అనే వివాహిత యువతి అదృశ్యమైందని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. శిరీషకు ఏడాది కిందట వివాహం జరగగా, ఆమె అనారోగ్యంతో ఉండటంతో రెండు నెలలకే విడాకులు అయ్యాయని తెలిపారు. అప్పటి నుంచి తల్లిగారి ఇంటిలో ఉంటున్న శిరీష ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించింది. సోమవారం వేకువజామున 3 గంటలకు ఆమె సోదరి చూసే సరికి కనిపించకుండా పోయిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతు న్నామని పోలీసులు తెలిపారు.

పంటపొలాల్లో మంటలు



కన్నాపూర్‌లో చెలరేగుతున్న మంటలు

శంకరపట్నం, మే 20: శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం పంట పొలాల్లో మంటలు చెలరేగాయి. దీంతో గ్రామానికి చెందిన రైతులు కాసం దామోదర్‌రెడ్డి, పిన్‌రెడ్డి తిరుపతిరెడ్డి, పిన్‌రెడ్డి వెంకటరమణారెడ్డిల వ్యవసాయ బావుల వద్ద ఉన్న విద్యుత్ మోటర్లు, పైపు లు, బెల్టులు, వైర్లు కాలి బూడిదయ్యాయి.

సంతోషిమాత దేవాలయ వార్షికోత్సవం

జమ్మికుంట, మే 20: జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్‌లో సంతోషిమాత దేవాలయ 11వ వార్షికోత్సవం సోమవారం ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, చెండీ హోమం, సుప్రభాత సేవ, కుంకుమార్చన, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చా రు. ఈ కార్యక్రమంలో ఆర్య మహాసభ జిల్లా అధ్యక్షులు చందా రాజు, అయిత యుగేందర్, జి రాజమౌళి, ముక్క నారాయణ, అయిత మహేష్, యాద సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం

గంగాధర, మే20: జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గంగాధర మండలం లక్ష్మిదేవిపల్లికి చెందిన ఆయన అభిమాన సంఘం జిల్లా ఉద్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకుయువత ముందుండాలని పిలుపునిచ్చారు.